# ఆదిలాబాద్‌లో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా



జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధికారులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమెకు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, పట్టణ సీఐలు కే సత్యనారాయణ, ఏ అశోక్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త పెట్రోల్ పంపు ప్రారంభోత్సవానికి ఆమె జిల్లా కేంద్రానికి చేరుకున్నారు.



# లక్ష్యంతో చదవాలి

అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి



బైంసా : విద్యార్థులతో చైర్మన్ నరేందర్ రెడ్డి

నిర్మల్ అర్బన్/బైంసా, ఫిబ్రవరి 23: నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులు శ్రమించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. నిర్మల్, బైంసా పట్టణాల్లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరగతి గదిలో బోధించిన విషయాలు విద్యార్థుల జీవితాలపై చాలా ప్రభావం చూపుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తాయని చెప్పారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. చైర్మన్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

# ఎన్నికలకు సన్నద్ధం

## లోక్‌సభ ఎలక్షన్ ప్రక్రియలో యంత్రాంగం నిమగ్నం

- ఉద్యోగుల వివరాలు సేకరణ
- ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో మూడు జిల్లాలు
- ఏడు నియోజకవర్గాల్లో 12,682 మంది సిబ్బంది అవసరం

*ఎన్నికల కమిషన్ ఓటర్ జాబితా సవరణ-2024 పూర్తి చేసిన నేపథ్యంలో, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడనుంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అధికారులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కార్యాలయంలో 55 ప్రభుత్వ శాఖల నుంచి ఉద్యోగుల సమాచారం సేకరించి కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసే సమయంలోగా అవసరమైన సమాచారాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు.*



ఆదిలాబాద్, ఫిబ్రవరి 23 ( నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ఇటీవల విడుదల చేసింది. మొత్తం ఓటర్లు 16,45,720 ఉండగా పురుషులు 8,02,267 మంది, మహిళలు 8,41,251 ఉన్నారు. ఇతరులు 87 మంది, సర్వీస్ ఓటర్లు 2116 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా నిర్మల్‌లో ఎక్కువగా 2,56,389 మంది, బోథ్‌లో తక్కువగా 2,11,466 మంది ఉన్నారు. సిర్పూర్‌లో 2,29,145, ఆసిఫాబాద్‌లో 2,26,695, ఖానాపూర్‌లో 2,24,380, ఆదిలాబాద్‌లో 2,43,768, ముథోల్ లో 2,53,876 మంది ఓటర్లు ఉన్నారు.

### 45 రకాల సమాచార సేకరణ

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలు వస్తాయి. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ ఆదిలాబాద్ జిల్లాలో రెండు,



నిర్మల్ జిల్లాలో మూడు, కుమ్రంభీం, ఆసిఫాబాద్ జిల్లాలో రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంట్ నియోజకవర్గంలో 2412 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల నిర్వహణ కోసం 12,682 మంది అధికారులు, సిబ్బంది అవసరమవుతారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున అదనంగా 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వులో ఉండేలా వివరాలు సేకరిస్తున్నారు. ఎమర్జెన్సీ సేవలకు సంబంధించిన శాఖలను మినహాయించి 55 శాఖలకు చెందిన సిబ్బందికి సంబంధించిన 45 రకాల సమాచారాన్ని తీసుకుంటున్నారు. పీవో, ఏపీవో, ఓపీవో నియామకం కోసం వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది బేసిక్ పేను ఆధారంగా తీసుకుంటారు. సిబ్బందిపై శాఖాపరమైన కేసులు, ఆరోగ్య సమస్యలు, బ్యాంకు వివరాలు, ఫోన్ నంబర్లు ఇతర వివరాలు సేకరించి కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం తమ శాఖలో పనిచేస్తున్న వారందరూ ఉద్యోగులు సమాచారం ఇచ్చినట్లు సంబంధిత శాఖల ఉన్నతాధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్నారు.

# వన్యప్రాణుల విలవిల

- దాహార్తి తీర్చుకునేందుకు తప్పని తిప్పలు
- సాసర్ పిట్‌ల నిర్వహణకు నిధుల కొరత
- ఇప్పటికే మండుతున్న ఎండలు
- నీటి కోసం గ్రామాల్లోకి వస్తూ బలవుతున్న అటవీ జంతువులు
- నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

నిర్మల్, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన సాసర్ పిట్‌లు (నీటి తొట్టెలు) ప్రస్తుతం నిధుల లేమితో నిర్వహణకు నోచుకోక అలంకార ప్రాయంగా మారుతున్నాయి. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్ అటవీ డివిజన్ల పరిధిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు గత ప్రభుత్వం పెద్ద ఎత్తున సాసర్ పిట్‌లను ఏర్పాటు చేసింది. నిర్మల్ పరిధిలోని మామడ, దిమ్మదుర్తి, బైంసా, నిర్మల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో దాదాపు 170 సాసర్ పిట్‌లను ఏర్పాటు చేయగా, ఖానాపూర్ డివిజన్ పరిధిలోని కవ్వాల్ అభయారణ్యంలో తాండ్ర, పెంబి, ఉడుంపూర్, కడెం, ఖానాపూర్ రేంజ్‌లలో 189 సాసర్ పిట్‌లను ఏర్పాటు చేసి వన్యప్రాణులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏటా కేసీఆర్ ప్రభుత్వం నిర్మల్ ఫారెస్ట్ డివిజన్‌కు దాదాపు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షలు, ఖానాపూర్ డివిజన్‌కు రూ. 5 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు నిధులను జనవరి నెలలోనే కేటాయించేది. ఈ నిధులతో సంబంధిత శాఖ అధికారులు వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి అవసరమైన ఏర్పాట్లు చేసేవారు. ట్యాంకర్ల ద్వారా మూడు, నాలుగు రోజుల కోసారి ఆయా నీటి తొట్టెల్లో నీటిని నింపడం, పలు చోట్ల ఏర్పాటు చేసిన సోలార్ సహాయంతో నడిచే బోర్ల ద్వారా వన్యప్రాణుల దాహార్తిని తీర్చేవారు. వానకాలం



సాసర్ పిట్‌ల వద్ద దాహార్తిని తీర్చుకుంటున్న వన్యప్రాణులు (ఫైల్)



కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో నీరు లేని సాసర్ పిట్‌లు

ప్రారంభం వరకు ఈ ప్రక్రియ కొనసాగేది. దీంతో నీటి అవసరాల కోసం వన్యప్రాణులు అడవిని వదిలి బయటకు రాకుండా ఉండేవి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 3 నెలలు కావస్తున్నా సాసర్ పిట్‌ల నిర్వహణకు ఇప్పటి వరకు నయా పైసా విడుదల చేయలేదు. ఇప్పటికే ఎండలు ముదరడంతో వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకోవడం కోసం గ్రామాల్లోకి, పంట చేలల్లోకి వస్తున్నాయి. ఈక్రమంలో రోడ్డు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ఇదే అదునుగా కొందరు వేటగాళ్లు సైతం ఉచ్చు బిగించి అడవి జంతువులను బలి తీసుకుంటున్నారు.

### నాలుగు నెలలు కీలకం..

ముఖ్యంగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మూగ జీవాలకు తాగునీటి సమస్య తలెత్తుతుంది. దీంతో ఈ నాలుగు నెలల కాలంలో అటవీశాఖ అధికారులు వన్యప్రాణులను సంరక్షించడానికి పకడ్బందీ చర్యలు చేపట్టేవారు. సాసర్ పిట్‌ల వద్ద వన్యప్రాణుల కదలికలు, కొత్త జంతువులను గుర్తించేందుకు సీసీ కెమెరాలను కూడా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఖానాపూర్ అటవీ డివిజన్ పరిధిలో కవ్వాల్ అభయారణ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వేసవిలో వన్యప్రాణులు అడవిని దాటి బయటకు రాకుండా సాసర్ పిట్‌లతో పాటు చెక్‌డ్యాంలు, నీటి కుంటలు కూడా నిర్మించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులను కేటాయించి వన్యప్రాణులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



ఇటీవల నీటి కోసం వచ్చి ప్రమాదంలో మృతి చెందిన దుప్పి

# 'పీఎం విశ్వకర్మ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

- లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు అవగాహన కల్పించాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఎదులాపురం, ఫిబ్రవరి 23: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన పీఎం విశ్వకర్మ యోజన పథకంపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. పీఎం విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా కులవృత్తి చేసుకునే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా కేవలం 5 శాతం తక్కువ వడ్డీకి రుణం పొందవచ్చని, సబ్సిడీ సైతం ఉంటుందని, వివిధ వృత్తులు చేసుకునే వారికి శిక్షణ ఇవ్వడం, మార్కెటింగ్‌తో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, కల్పించాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, డీపీవో శ్రీలత, ఎల్‌డీఎం భాస్కర్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రాజేశ్ కుమార్, మెప్మా డీఎంసీ శ్రీనివాస్, సీఎస్సీ మేనేజర్ రాహుల్, కార్యాలయ పర్యవేక్షకుడు సత్యనారాయణ, డీఆర్పీ శివ, తదితరులున్నారు.

### ఎన్నికలు బహిష్కరించొద్దు: గొల్లగఢ్‌లో కలెక్టర్

భీంపూర్,ఫిబ్రవరి 23: మండలంలోని గొల్లగఢ్ గ్రామంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం పర్యటించారు. రోడ్డు సమస్య పరిష్కరించాలని ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలను ఈ గ్రామస్తులు బహిష్కరించారు. ఆ సమయంలో గ్రామానికి వచ్చి సమస్యలు తెలుసుకుంటానని కలెక్టర్ హామీనిచ్చారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో కలెక్టర్ గ్రామానికి వచ్చారు. పిప్పల్‌కోటి బోర్లకుంట నుంచి గొల్లగఢ్ వరకు 5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలు బహిష్కరించొద్దని కోరారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. మరి కొన్ని సమస్యలు గ్రామస్తులు దృష్టికి తేగా, వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ సత్యనారాయణ రావు, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఏఈలు చంద్రశేఖర్, మహేశ్, మాజీ సర్పంచ్ నైతం సుమలత, గ్రామ పెద్దలు నైతం రవీందర్, దీపక్ తదితరులున్నారు.



అంగన్‌వాడీలో పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



లాస్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, పార్టీ నాయకులు



నివాళులర్పిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

# ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరం

**సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరమని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు.**

## పలువురు ప్రముఖుల నివాళి

ఎదులాపురం,ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో తనువు చాలించడంతో పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం లాస్య నందిత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించా రు. పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం బాధాకరమని పార్టీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లాస్య నందిత మరణం పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటన్నారు. లాస్య నందిత తండ్రి సాయన్నతో తనకు సత్సంబంధాలు ఉండేవని, ఆయన మృతి చెందిన తర్వాత కూతురు సైతం తనువు చాలించడం బాధాకరమని పేర్కొన్నారు. లాస్య కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరుతూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి సతీశ్, సంద నర్సింగ్,అశోక్ స్వామి, భరత్ కుమార్, నాయకులు నారాయణ, రోకండ్ల రమేశ్, మహిళా అధ్యక్షురాలు స్వరూపరాణి, సభ్యులు కరుణ, ధమ్మపాల్, శ్రీనివాస్, రాంకుమార్ తదితరులున్నారు.

### నివాళులర్పించిన ఖానాపూర్ ఎమ్మెల్యే..

ఉట్నూర్, ఫిబ్రవరి 23: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరమని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లాస్య చిత్రపటానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి అల్లోల దిగ్భ్రాంతి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. లాస్య మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తనను ఎంతో బాధకు గురి చేసిందని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

### నిర్మల్ ఎమ్మెల్యే సంతాపం

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 23: బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపై తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నట్లు నిర్మల్ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్‌లీడర్ మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పిన్నవయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చిన లాస్యనందిత ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో, గుర్తింపు తెచ్చుకొని ఎమ్మెల్యేగా ఎన్నికైందని ఆయన కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


# కరంజి(టీ) రూట్‌లో మళ్లీ ఆర్టీసీ బస్సు



కరంజి(టీ)కి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

నమస్తే ఎఫెక్ట్

భీంపూర్, ఫిబ్రవరి23: భీంపూర్ మండలం కరంజి(టీ) రూట్‌లో ఆర్టీసీ అధికారులు శుక్రవారం నుంచి తిరిగి బస్సులు నడిపిస్తున్నారు. ఈ రూట్‌లో నాలుగు రోజులుగా ఒక్క బస్సు కూడా నడిపిస్తలేరు. దీంతో 'నమస్తే తెలంగాణ'లో ..'ఆర్టీసీ అధికారులూ బస్సులు నడపండి' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. మేడారం జాతరకు బస్సులు నడిపిస్తున్నామనే సాకుతో కరంజీ(టీ) రూట్‌లో బస్సులను రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అధికారుల దృష్టికి ఈ కథనం వెళ్లింది. దీంతో స్పందించిన అధికారులు ఈ రూట్‌లో ఒక ట్రిప్పు బస్సు నడిపించారు. దీంతో ఈ రూట్‌లోని 45 గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంజేశారు.



కేంద్రం, హర్యానా ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

# కేంద్రం, హర్యానా ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: యువ రైతు శుభకరణ్ సింగ్‌ను పంజాబ్ సరిహద్దులో కేంద్రం, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు కాల్చి చంపడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌లోని సుందరయ్య కార్యాలయం ఎదుట దిష్టిబొమ్మ దహనం చేశారు. కేంద్ర హోం మంత్రి, హర్యానా సీఎంలపై హత్యానేరం మోపాలని, రైతాంగ ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని నినదించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ రైతుల రైతుల పోరాటాన్ని అణిచివేయడాన్ని నిరసిస్తూ దేశమంతటా రైతులను చైతన్యవంతం చేయాలని కోరారు. కేంద్ర హోం మంత్రి, హర్యానా ముఖ్యమంత్రి, ఆ రాష్ట్ర హోం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే ఈనెల 26న జాతీయ రహదారులపై ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్.మంజుల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, సహాయ కార్యదర్శి ఎస్.స్వామి, కే ఆశన్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అగ్గిమల్ల స్వామి, జిల్లా నాయకులు పోచక్క, హరి, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. అటవీ అధికారుల విధులకు అడ్డంకి కలిగించారనే కేసులో జిల్లా కోర్టు విధించిన శిక్షను హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. అటవీ అధికారుల విధులకు అడ్డంకులు కల్పిస్తున్నారన్న ఫిర్యాదుపై 2006 మార్చి 11న ఆయనపై కేసు నమోదైంది. లక్షెట్టిపేట జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ 2 ఏళ్ల జైలు, రూ.3 వేల జరిమానా విధించింది. దీనిపై రాథోడ్ అప్పీల్ దాఖలు చేయగా, అదిలాబాద్ జిల్లా కోర్టు ఆ శిక్షను సవరించింది. రూ.10 వేలు జరిమానాను శిక్షగా విధిస్తూ 2007లో తీర్పు చెప్పింది. దీనిపై 2008లో హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయగా, రూ.10 వేల జరిమానా శిక్షను రద్దు చేస్తూ జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. రాథోడ్ తరఫున న్యాయవాది ఎస్. సురేందర్ రెడ్డి వాదిస్తూ, పిటిషనర్ అటవీ అధికారుల విధులకు ఏవిధమైన ఆటంకం కలిగించలేదన్నారు. కింది కోర్టు తీర్పును రద్దు చేయాలని కోరారు. వాదనల తర్వాత న్యాయమూర్తి, అటవీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారనేందుకు తగిన ఆధారాల్లేవని తేల్చింది.

# ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

### ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులకు సూచించారు. ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులకు శుక్రవారం దిశానిర్దేశం చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్, దుర్వినియోగాలకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష ప్రశ్నాపత్రాలు ఓపెనింగ్, జవాబు పత్రాలు ప్యాకింగ్, మొబైల్ ఫోన్ యాప్ అన్నీ సీసీ కెమెరాల ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. సెల్‌ఫోన్లు పరీక్షా కేంద్రాలకు అనుమతి లేదన్నారు. ప్రతి కేంద్రంలో ఏఎన్ఎం మెడికల్ కిట్స్‌తో అందుబాటులో ఉండాలని, సరిపడా ఇన్విజిలేటర్‌ను నియమించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి, పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

### నిర్మల్‌లో..

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 23: ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్, వచ్చే నెల జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పరీక్షల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుశాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని, మాస్ కాపీయింగ్ జరగకుండా, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరీక్షల అధికారులు పాల్గొన్నారు.